క్లుప్తంగా

యువ ఓటర్లలో చైతన్యం



జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి రాజేష్ జోగ్‌పాల్, కలెక్టర్ నివాస్‌లకు పుష్పగుచ్ఛం అందించిన పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు

బోట్‌క్లబ్: కాకినాడ జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు ప్రశాంత వాతావరణం ఉండడంతో ఓటింగ్ శాతం పెరిగిందని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. జిల్లా కలెక్టర్ జె నివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపడం, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చేపట్టిన శాంతి భద్రతల నిర్వహణతో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. కాకినాడ సిటీలో 72 శాతం, రూరల్‌లో 73 శాతం జిల్లాలో 75 శాతం పోలింగ్ జరగడం అత్యంత అభినందనీయమన్నారు. జేఎన్‌టీయూ లైబ్రరీ హాలులో ఎన్నికల ప్రత్యేక అధికారి రాజేష్ జోగ్‌పాల్, జిల్లా ఎన్నికల అధికారి నివాస్‌లకు మంగళవారం పౌర కన్వీనర్ ప్రముఖ సామాజికవేత్త దూసర్ల పూడి రమణరాజు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

ఘనంగా గురుపూజోత్సవం

బోట్‌క్లబ్: ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ 29వ ఆశ్రమ స్వీకారోత్సవ (పీఠారోహణ) సందర్భంగా బెంగళూరు జయ తీర్థ విద్యాపీఠ పూర్వ విద్యార్థి యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక గొడారి గుంటలోని రమాసహిత సత్యదేవ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యాత్మ తీర్థ స్వామీజీ స్వీయ పర్యవేక్షణలో దేశమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించడంలో చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఏటా విద్యార్థులను సుధా పండితులుగా తీర్చిదిద్ది సమాజానికి అందిస్తున్న గొప్ప వ్యక్తిగా కొనియాడారు. మధ్వాచార్యుల నుంచి సత్య ప్రమోదుల తీర్థులు వరకు ఉన్న స్వామీజీల మహిమలతో పాటు ఇతర మఠ విశేషాలను ప్రవచన రూపంలో సత్యాత్మ తీర్థ స్వామీజీ అందిస్తున్న ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదిగా పేర్కొన్నారు. ఈ ప్రాంత మధ్వ గృహస్తులకు స్వామీజీ ఆశీస్సులు నిరంతరం కలగాలన్న ఆశయంతో గురుపూజోత్సవంతో పాటు అనేక కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్నామన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు పంపిణీలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ప్రసూన తదితరులు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు మంగళవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ వీవీజీ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం భార్య మీనాక్షి ఆర్థిక సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, శ్రీదేవి రెడ్డి, శ్రీవాణి, నాగిరెడ్డి లక్ష్మి, సునీత, చల్లా విజయలక్ష్మి పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి 23వ తేదీ వరకు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు సేవలు అందించేందుకు పలువురు భక్తులు బుధవారం గోవింద మాలధారణ చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురష్కరించుకుని ప్రతిరోజు సుప్రభాత సేవ, తిరువారాధన, బాలభోగం, తీర్థప్రసాద గోష్టి, ద్వార తోరణపూజ, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, దర్శనాలు, అర్చనలు, పవళింపు సేవలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

కార్యక్రమాలు ఇవీ

16న ఉత్సవ ఆరంభ స్నపనం (క్షీరాభిషేకం), విష్వక్షేన ఆరాధన, పల్లకీ సేవ జరుగుతుంది. 17న ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, మండలారాధన. అగ్ని ప్రతిష్ఠ, భేరి పూజ, వాహన సేవలు, 18న సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఆలయం చుట్టూ త్రీ ప్రదక్షణ, శ్రీవారికి సహస్ర దీపాలంకార సేవ, భక్తుల స్వహస్తాలతో హారతి సమర్పణ, శేష వాహన సేవ నిర్వహిస్తారు. 19న శ్రీకృష్ణ గోపికా పూజ, ఎదురుకోలు ఉత్సవం, రాత్రి ఏడు గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరగనుంది. 20న లక్ష్మీనారాయణ వ్రతం, శ్రీకృష్ణ తులాభారం, 21న సుదర్శన హోమం, సాయంత్రం అన్నమాచార్య సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, హిందూస్తానీ భజనలు ఏర్పాటు చేశారు. 22న శ్రీలక్ష్మీ నారసింహా హోమం, గరుడ వాహన సేవ, మృగయోత్సవం, రామాలయం వరకూ తిరువీధి దొంగల దీపోత్సవం, 23వ మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవ వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, శ్రీపుష్పయాగం, మహాదాశీర్వచనం, ఋత్విక్సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ఓటెత్తిన ప్రజలు అతివల తీర్పు పైనే ఆశలు



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

- పిఠాపురం నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదు
- మందకొడిగా సాగిన ఓటింగ్
- పెరిగిన పోలింగ్ శాతం

పిఠాపురం: నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌కు ప్రజలు పోటెత్తారు. 2019 ఎన్నికల కంటే 2024 ఎన్నికల పోలింగ్ శాతం భారీగా పెరిగింది. 2019లో పిఠాపురం నియోజకవర్గంలో 239 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా 1,15,717 మంది పురుషులు 1,13,869 మంది స్త్రీలు ఇతరులు 5 మొత్తం 2,29,591 ఉండగా, పురుషులు 94,435 మంది, స్త్రీలు 91,505 మంది మొత్తం 1,85,940 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 81.61 శాతం, స్త్రీలు 80.36 శాతం మొత్తం 80.99 శాతం నమోదయ్యింది.

2024లో పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,05,369 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 1,03,371 మంది, స్త్రీలు 1,01,434 మంది తమ ఓటు హక్కును వినిమోగించుకున్నారు. మొత్తం పోలింగ్ 86.63 శాతం నమోదయ్యింది. 2019 కంటే ఈ దఫా ఎన్నికల్లో 6 శాతం మంది ఓటర్లు అధికంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో 239 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా ఈదఫా ఎన్నికల్లో 242 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు గంటల తరబడి బారులు తీరారు. ఒక ఓటరు ఓటు వేసేందుకు సుమారు రెండు నిమిషాలు సమయం పట్టడంతో పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగింది. వేసవి తపం ఉన్నా ఓటు వేయడానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సాయంత్రం 6 గంటలకే పోలింగ్ సమయం ముగిసినా అప్పటికే ఓటర్లు బారులు తీరి పోలింగ్ కేంద్రాల్లో ఉండడంతో వారందరు ఓటు వేసే సరికి రాత్రి 10 గంటలు దాటింది.

పెరిగిన అవగాహన

ఈ దఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా ఎన్నికల సంఘం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గత రెండు నెలలుగా కొత్త ఓటర్ల చేరికలు చేపట్టిన ఎన్నికల సంఘం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విస్తృత ప్రచారం నిర్వహించింది. ఎక్కడికక్కడ అవగాహన సదస్సులు ఏర్పాటుతోపాటు ప్రసార మాద్యమాల్లోను ప్రజలను ఆకట్టుకునేలా ప్రచారం చేయడంతో ఓటర్లలో చైతన్యంవచ్చింది అనడానికి పెరిగిన పోలింగ్ శాతమే నిదర్శనమంటున్నారు.

- వారి ఓట్లపైనే అభ్యర్థుల ఆశలు
- ఓట్ల లెక్కింపు పైనే అందరి దృష్టి
- నియోజకవర్గంలో 82.28 శాతం పోలింగ్



సామర్లకోట, పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాలలో సోమవారం రాత్రి 9 దాటినా బారులు తీసిన ఓటర్లు



యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో రాత్రి 9 దాటిన తరువాత ఓటు వేయడానికి వేచి ఉన్న ఓటర్లు

సామర్లకోట: గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరిగింది. దీనికి తోడు పోలింగ్ సమయం ముగిసినా అర్ధరాత్రి 11 గంటల వరకు ఓటర్లు క్యూలో బారులు తీరి ఓట్లు వేశారు. నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలోనే అనేక పోలింగ్ బూత్‌లలో 11 గంటల వరకు పోలింగ్ జరిగింది. దాంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేశారు. పీబీ దేవం, మాధవపట్నం, వీకే రాయపురం, వేట్లపాలెం గ్రామాల్లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగింది. పోలింగ్‌లో మహిళా ఓటర్ల శాతం ఎక్కువగా ఉండడంతో ఎవరికి వారే తమదే విజయమని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున అమలుచేయడంతో మహిళలు అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్ని తమ అభిమానాన్ని చాటుకున్నారని ఆ పార్టీ నాయకులు, నేతలు భావిస్తున్నారు. అయితే టీడీపీ నాయకులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీతో మహిళలు ముందుకు వచ్చి ఓట్లు వేశారని సంతోష పడుతున్నారు. ఆటో డ్రైవర్లు యజమానుల కుటుంబాలు ఎవరికి ఓటు వేస్తాయనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. టీడీపీ నాయకులు రాజప్ప హ్యాట్రిక్ సాధిస్తున్నాడని ప్రచారం చేస్తూ ఉండగా, వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక నాయకుడు గెలుస్తున్నాడనే ధీమాతో ఉన్నారు.

నియోజకవర్గంలోని 201 పోలింగ్ బూత్‌లలో మొత్తం 2,15,095 మంది ఓటర్లకు 1,09,294 మంది స్త్రీలు, 1,05,788 మంది పురుషులు, 13 మంది ఇతరులు ఉండగా 1,76,987 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు మంగళవారం ప్రకటించారు. దాంతో 82.28 శాతం పోలింగ్ నమోదైంది. 88,895 మంది స్త్రీలు, 88,084 మంది పురుషులు, ఇతరులు 8 మంది ఓట్లు వేశారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటలకు వరకు 9.35 శాతం, 11.45 నిమిషాలకు 23.44 శాతం, ఒంటి గంటకు 31.28 శాతం, మూడు గంటలకు 50.67 శాతం, ఐదు గంటలకు 64.10 శాతం పోలింగ్ అయింది. సాయంత్రం ఐదు గంటకు 1,36,974 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారులు తెలిపారు. రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగడం, మరుసటి రోజు ఎన్నికల అధికారులు, సిబ్బందికి సెలవు ప్రకటించడంతో చివరి పోలింగ్ శాతం కోసం అందరూ ఎదురు చూడావలసిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు, మహిళలు పోటీ పడి ఓట్లు వేయడంతో సంక్షేమ పథకాలకే వారు మొగ్గు చూపారనే అభిప్రాయం వినిపిస్తోంది.

సమస్యలు లేకుండా చర్యలు

సాధారణంగా పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు పోయిందని ఎవరో వేసేశారని ఓటర్లు వివాదాలకు దిగడం పరిపాటిగా ఉంటుంది. కాని ఈ ఎన్నికల్లో అటువంటి సమస్యలు రాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఇటువంటి సమస్యలు రాకుండా పూర్తి ఆధారాలతో ఉన్న ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. స్వయంగా రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి ఓటరు స్లిప్‌లు పంచి అధికారికంగా సంతకాలు సైతం తీసుకోవడంతో సమస్యలు లేకుండా పోలింగ్ నిర్వహించ గలిగారు. మరో పక్క వివిధ పార్టీల అభ్యర్థులు ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసినప్పటికీ ఎక్కువ మంది అధికారులు అందజేసిన స్లిప్‌లే వినియోగించుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు అందజేసిన స్లిప్‌లు తెచ్చిన వారిని ఆధార్‌కార్డు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతించడంతో అందరు అధికారులు అందజేసిన స్లిప్‌లే వినియోగించుకున్నారు.

మండుతున్న ఎండలు



జనం సంచారం లేని సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఎండలకు మూసి వేసిన దుకాణాలు

- వృక్షాల తొలగింపుతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- వేసవి వస్తోందంటే హడలిపోతున్న జనం

సామర్లకోట: ఏటేటా ఎండాకాలం మరింత మండిస్తోంది. మంగళవారం 37 నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలనీ దాదాపు నిర్మానుష్యమైపోయాయి. ఎండలకు భయపడి వ్యాపారులు సైతం దుకాణాలు బంద్ చేస్తున్నారు. 24 గంటలూ ఇంట్లో ఫ్యాన్ తిరుగుతున్నా వేడిగాలి తప్పితే శరీర తాపం తీరడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రోడ్ల విస్తీర్ణం పేరుతో ఏడీబీ రోడ్డులోను, సామర్లకోట-పెద్దాపురం రోడ్డులోను భారీ వృక్షాలను తొలగించడంతో వాతావరణంలో భారీ మార్పు కనిపిస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. చెట్ల నరికివేతకు తోడు సిమెంట్ రోడ్లు కావడంతో సూర్యుడి వేడికి తోడు నేల నుంచి వచ్చే సెగ తీవ్ర ఇబ్బంది పెడుతోందని వారంటున్నారు. స్టేషన్ సెంటర్‌లో నిలబడడానికి నీడ లేని పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెట్లు తొలగింపుతోనే..

నియోజకవర్గ పరిధిలో ఇటీవల కాలంలో సుమారు వెయ్యి చెట్ల వరకు తొలగించారు. దాంతో వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చి వేడి పెరిగిపోతోంది. రోడ్ల విస్తీర్ణం మంచిదే. ఆ భారీ వృక్షాలు ఉన్న సమయంలో వాటిని మద్యలో ఉంచి రోడ్డు వెడల్పు చేసే మంచి ఫలితాలు ఉండేవి. పట్టణ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమం సక్రమంగా జరగడంలేదు. ప్రస్తుత వేసవి కాలంలో కరెంటు కోత లేక పోవడంతో కొంత వరకు ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మెట్ట చరితపై మరుగేల!

- ఆక్రమణలకు గురవుతున్న చారిత్రక స్థలం
- చరిత్ర చెరిగిపోతున్నా పట్టించుకోని అధికారులు
- కొండ నుంచి రాజమండ్రి గోదావరి వరకు గుహ ఏర్పాటు
- పాండవుల మెట్టకు పెరుగుతున్న యాత్రికులు
- అభివృద్ధి చేయాలని విన్నపం



పాండవుల మెట్ట ఎక్కేందుకు ఏర్పాటు చేసిన మెట్లు

సామర్లకోట: వేసవి కాలం కావడంతో సాయంత్రం సమయంలో యాత్రికులు, స్థానికులు పాండవుల మెట్టను సందర్శిస్తున్నారు. పాండవులు అజ్ఞాత వాసం చేసిన సమయంలో పెద్దాపురానికి సమీపంలో ఉన్న ఒక మెట్టపై పాండవులు నివసించినట్టు చరిత్ర చెప్తోంది. ఈ కారణంగానే ఈ మెట్టను పాండవుల మెట్టగా పిలుస్తారు. పాండవులకు సంబంధించి మహాభారతంలో ఒక చరిత్ర ఉంది. కౌరవుల చేతిలో పాండవులు జూదంలో ఓటమి చెందడంతో అజ్ఞాత వాసం చేయాల్సి వచ్చిన సమయంలో వారు పాండవుల మెట్టపై నివసించి రాజమహేంద్రవరంలోని కోటి లింగాల రేవు వరకు గుహ ఏర్పాటు చేశారు. నిత్యం గోదావరి స్నానం చేసి పూజాదికాలు నిర్వహించేవారని కథనాల ఉన్నాయి. ఈ మెట్టపై సూర్యనారాయణ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పాండవులు పూజలు చేసే వారని ప్రతీతి. నేటికీ రథ సప్తమికి ఇక్కడి సూర్య భగవానునికి ఉత్సవాలు, కల్యాణాలను, అన్నదానాన్ని అర్చకులుగా ఉన్న వై.అనంతలక్ష్మీ, ఎ. గీతావాణిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

కొండపై భీముడి గద ఉంచినట్లు, అక్కడ నిలబడడంతో ఆయన పాదాలు ఉన్నట్లు చెప్తారు. ఈ ప్రాంతంలో రాళ్లు ఒకననిపై ఒకటి పేర్చి ఎన్ని రాళ్ల పేర్చితే అన్ని అంతుస్తుల భవనం నిర్మాణం చేస్తామని నమ్మకం ఉంది. దాంతో ఆ ప్రదేశంలో రాళ్లను భక్తులు పేరుస్తారు. అలాగే భీముడి వంటశాలను అధికారులు అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటికే కొండపై పోలీసు సబ్ స్టేషన్‌ను నిర్మించారు. అలాగే సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేశారు.

గుహపై దృష్టి సారించాలి...



పాండవుల మెట్టపై ఉన్న గుహపై పర్యాటక శాఖ అధికారులు దృష్టి పెట్టాలి. ఈ గుహలోనికి వెళ్లడానికి ప్రయత్నిస్తే గబ్బిలాల వాసన వస్తుంది. వందలాది సంవత్సరాలకు చెందిన గుహ వల్ల చాలా వరకు ఇది మూసుకుపోయింది. ఈ గుహలో లైట్లు ఏర్పాటు చేసి మార్గాన్ని అన్వేషించే ప్రయత్నం చేయాలి. పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

– కత్తుల రామ్మోహనరావు, విద్యా సంస్థ అధినేత, పెద్దాపురం


సామర్లకోట రైతు శిక్షణా కేంద్రాన్ని ఈ మెట్టపైనే నిర్మించారు. ఇటీవల మూడు ఎకరాల స్థలాన్ని శతాబ్ది పార్కు పేరుతో రూ.మూడు కోట్లతో అభివృద్ధి చేశారు. భావితరాలకు ఇటువంటి చరిత్రలు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనిలో భాగంగానే ప్రముఖ దేవాలయాలను పురావస్తుశాఖ స్వాధీనం చేసుకుంది. అదే విధంగా పెద్దాపురంలోని పాండవుల మెట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి భావితరాలకు అందించాల్సి ఉంది.



మెట్టపై నిర్మించిన సూర్యనారాయణమూర్తి ఆలయం



పాండవులు ఏర్పాటు చేసుకున్న గుహ



భీముని వంట శాల

పీహెచ్‌సీ పక్కనే చెత్త

- ఇబ్బంది పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లి ఆరోగ్యకేంద్రం వద్ద డంప్ చేసిన చెత్త

కొత్తపల్లి: ఆరోగ్యం మాట దేవుడెరుగు ఆ ఆసుపత్రికి వెళితే లేని రోగాలంటుకుంటాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిని డంపింగ్ యార్డుగా మార్చేశారు. అక్కడకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందేనని రోగులు అంటున్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి అక్కడే వేయడంతో దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇదీ పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో వాకతిప్పలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద పరిస్థితి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డును ఊరికి దూరంగా ఉండే ప్రదేశాల్లో వేయాలి. అయితే మండలంలోని వాకతిప్పలో సేకరించిన చెత్తను స్థానిక ఆరోగ్యకేంద్రం వద్ద డంపింగ్ చేస్తున్నారు. గ్రామాల్లో అధికారులు మనం-మన పరిశుభ్రత, స్వచ్ఛ సంకల్పం అంటూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, ఊదరగొడుతున్న ప్రసంగాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రతి నిత్యం మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారి వరకూ పర్యటించే ఈ ప్రాంతంలో అధ్వానంగా ఉన్నా పట్టించుకునేవారే లేకపోవడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం

ఆరోగ్య కేంద్రానికి దగ్గరలోనే చెత్తను డంప్ చేయడం వల్ల దుర్వాసన వెదలజల్లడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం దుర్వాసన భరించలేకపోతున్నాం. ఇటువంటి పరిస్థితి వలన అంటు రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. చెత్తను తగలబెట్టడంవలన పొగ కేంద్రంలోకి వస్తోంది.

– సుష్మ, కొత్తపల్లి వైద్యాధికారి

స్థలం లేకపోవడంతో..

వాకతిప్ప పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డు చేసేందుకు ప్రభుత్వ స్థలం లేదు. ఉన్న స్థలంలోనే చెత్తను డంపింగ్ చేసి మరో చోటికి తరలిస్తున్నాం. త్వరలోనే చెత్తను తొలగిస్తాం. ఉన్నతాధికారులకు విషయం చెప్పి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, వాకతిప్ప పంచాయితీ కార్యదర్శి